కశింకోటలో గంజాయి పట్టివేత

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

అనకాపల్లి, జననేత న్యూస్: కశింకోట మండలంలోని 60 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ జి.ఆర్.ఆర్ మోహన్ వివరాలను వెల్లడించారు. స్థానికంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, గంజాయి రవాణా జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు కశింకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో తమ సిబ్బందితో మాటు వేసి వాహనాలు తనిఖీ చేస్తుండగా AP31TG8931 గల ఆటోలో 60 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఆటోకు పైలెట్లుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను, ఆటోను, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఘటన సమయంలో నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేయగా తమ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఒక నిందితుడు పరారైనట్లు వెల్లడించారు. పరారైన నిందితుడు కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అలాగే పట్టుబడిన నిందితులను కాకినాడ జిల్లా గాడి రత్నం రాజు (28), తూర్పుగోదావరి జిల్లా గోబేరు వెంకట చైతన్య (34), కోరాపుట్ జిల్లా గుంతా హిమాన్సు శేఖర్ (22), కారా కేసరి (32)లుగా గుర్తించామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్న ఏఎస్ఐ శ్యాంసుందర్, హెచ్‌జి డి.ఎస్ బాబులను జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందజేసారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

